క్లుప్తంగా

బాలసుబ్రహ్మణ్యంకు నివాళి



బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని సహాయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు గాన గందర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని గురువారం నిర్వహించారు. టీచర్స్ కాలనీలోని సహాయ్ పార్క్ వద్ద ఉన్న బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, బొద్దూరి శంకరరావు, బలగ అప్పారావు, సరిది రాంబాబు, పక్కి శ్రీను, కల్లూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు సుహాసిని ఆనంద్, రాజేష్‌వర్మ

గుర్ల: మండల కేంద్రంలోని బీవీఆర్ కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పీఎం నరేంద్ర మోదీ జన్మదినం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుహాసిని ఆనంద్, జిల్లా అధ్యక్షుడు పి.రాజేష్‌వర్మ తెలిపారు. గాంధీజీ జయంతి వరకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక నేతలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కనకరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మెరకముడిదాంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహిస్తున్న అధికారులు

మెరకముడిదాం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండగలమని మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు తెలిపారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా గురువారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు పరిశుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సులోచనారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్‌పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీరాములునాయుడు, ఎంఈఓ ధర్మశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


- చీపురుపల్లి ఉద్యానవన శాఖాధికారి అనూష



సాతాంవలసలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి అనూష

మెరకముడిదాం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధికలాభాలు పొందవచ్చని చీపురుపల్లి ఉద్యానవన శాఖాధికారి ఎం.అనూష తెలిపారు. సాతాంవలస రైతుసేవా కేంద్రంలో రైతులకు పలు రకాల ఉద్యాన పంటలపై గురువారం అవగాహన కల్పించారు. హెచ్ఓ అనూష మాట్లాడుతూ ఎకరా ఆయిల్‌పామ్ సాగుకు 29 వేలు రాయితీ వర్తిస్తుందన్నారు. పంట నిర్వహణకు రూ.10,500 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు రాయితీ వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో అంతరపంటలుగా అరటి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు.

సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం ఐసీడీఎస్ అధికారులు

లక్కవరపుకోట: జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా రంగరాయపురం గ్రామ గల అంగన్‌వాడీ కేంద్రం-1లో వియ్యంపేట ఐసీడీఎస్ పీఓ రొంగలి ఉమాదేవి ఆధ్వర్యం లో గర్భిణులకు గురువారం సీమంతం చేశారు. పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సహాయ సీడీపీఓ లక్ష్మీబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ రామలక్ష్మి,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా ఏదయా..!

- రైతన్నలను వీడని యూరియా కష్టాలు
- ప్రైవేటు దుకాణాల వద్ద తప్పని పడిగాపులు



చీపురుపల్లిలోని ఓ ప్రైవేటు దుకాణం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

చీపురుపల్లి: వరి సాగు కార్తెలు ఒక్కొక్కటిగా గడుస్తున్నాయి.. వరి చేను పొట్టదశకు సమీపిస్తోంది.. యూరియా మాత్రం రైతున్నకు అందని ద్రాక్షగా మారింది. డబ్బులిచ్చి కొనుగోలుచేసే యూరియా కోసం రైతన్నలు ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వ్యాపారుల చీవాట్లు తింటున్నారు. ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల వద్ద బస్తా యూరియా కోసం టోకెన్లు పట్టుకుని గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. వరుణుడు అనుకూలించకో.. విపత్తుల సమయంలో పంట సాగుకు ఇబ్బందులు తలెత్తడం సాధారణం. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సకాలంలో ఎరువు అందించలేకపోవడంతో పంట సాగుకు రైతుల కష్టాలు పడాల్సిన పరిస్థితి రైతు సమాజాన్ని ఆలోచనలోకి నెట్టేస్తోంది. ఓటేసిన పాపానికి సాగు కష్టాలు అనుభవిస్తున్నామన్న వేదన నిత్యం వెంటాడుతోంది.

● 16,18 తేదీల్లో ఇచ్చిన టోకెన్లతో...

యూరియా కోసం రైతులు రోజుల తరబడి పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్దకు తిరుగుతున్న సంగతి తెలిసిందే. దాదాపు పదిహేను రోజుల కిందట యూరియా కోసం వచ్చిన రైతులకు ఈ నెల 16, 18 తేదీల్లో ఇస్తామని వ్యవసాయ అధికారులు సంతకాలతో కూడిన స్లిప్పులు పంపిణీ చేశారు. ఆ స్లిప్పులు పట్టుకుని రైతులు ఆయా తేదీల్లో యూరియా కోసం వచ్చినప్పటికీ లభించలేదు. పట్టణంలోని ఓ ప్రైవేటు దుకాణం వద్ద టోకెన్లు పట్టుకుని యూరియా కోసం గురువారం నిరీక్షించారు.

గుర్లలో రైతన్నల ఆగ్రహం

గుర్ల: మండలంలోని తెట్టంగి, కొండగండ్రేడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా స్టాక్ ఉన్నప్పటికీ పంపిణీ చేయక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెట్టంగి ఆర్ఎస్‌కేలో 20 రోజుల కిందట 267 యూరియా బస్తాలు నిల్వ చేశారు. నేటికీ పంపిణీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జమ్ములో 20 రోజులుగా 60 యూరియా బస్తాలను నిల్వచేసినా పంపిణీ చేయలేదు. ఇదే విషయాన్ని ఇన్‌చార్జి ఏఓ నాగరాజు వద్ద ప్రస్తావించగా యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

యూరియా కోసం పాట్లు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం, పెదమానాపురం గ్రామాల రైతులు గురువారం ఉదయం నుంచి రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తే ఒక బస్తా చొప్పున లభించింది. యూరియా పంపిణీలో కూటమి ప్రభుత్వ తీరును రైతులు తప్పుబట్టారు. ఐదు ఎకరాలు సాగుచేస్తున్న వారికి ఒక బస్తా యూరియా ఇస్తే ఎలా సరిపోతుందంటూ పలువురు రైతులు అధికారులను ప్రశ్నించారు.



మరడాం ఆర్ఎస్‌కే వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ

● సక్రమంగా పంపిణీ చేయాలి



ఎరువుల పంపిణీపై వ్యవసాయశాఖాధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు

మెరకముడిదాం: ఎరువుల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు చోటివ్వకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు వ్యవసాయశాఖాధికారులను ఆదేశించారు. మండలంలోని భైరిపురం రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీని గురువారం పరిశీలించారు. పోలీసుల సమక్షంలో రైతులకు యూరియా అందజేయాలని సూచించారు. తహసీల్దార్ సులోచనారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్‌పట్నాయక్, ఏఓ శ్రావణితేజ తదితరులు యూరియా పంపిణీని పర్యవేక్షించారు.

అన్నపూర్ణగా కనకమహాలక్ష్మి



అన్నపూర్ణదేవిగా కనకమహాలక్ష్మి అమ్మవారు



కాత్యాయనీదేవిగా మానసాదేవి నాగశక్తి అమ్మవారు

చీపురుపల్లి: దేవీ నవరాత్రుల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. మండలంలోని రామలింగాపురం సమీపంలోని మానసాదేవి నాగశక్తి అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కార్యకర్తలే పార్టీకి బలం



పి.కె.పాలవలసలో గ్రామ కమిటీలు నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

చీపురుపల్లి: కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలమని, వారి సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం చెప్పారు. మండలంలోని కర్లాం, పి.కె.పాలవలస, పెదనడిపల్లి, చిననడిపల్లి తదితర పంచాయతీల్లో గురువారం గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీల్లో ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, ఆ సమయంలో కార్యకర్తలే తనకు ప్రాధాన్యమని జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: రైతులకు సకాలంలో, సరిపడా యూరియా సరఫరా చేయడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీపీ చల్లా చలం నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బస్తా యూరియా కోసం రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఎక్కడ చూసినా క్యూలు కనిపిస్తున్నాయని అన్నారు. యూరియా కొరత లేదని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నారని, కానీ వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటే రైతులు ఎందుకు గంటలు,రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం, అధికారుల ప్రణాళికా లోపం కారణంగానే ఈ సమస్య ఉత్పన్నమైందని మండిపడ్డారు.ఇప్పటికైనా రైతులకు సరిపడా ఎరువులను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ యూరియా కొరత అనే మాట వినపడలేదని గుర్తు చేశారు.

మానవ హక్కులను కాపాడేందుకు కృషి



ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ అప్పలరాజుకు ఐడీ కార్డు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గౌరినాయుడు

బొండపల్లి: మానవ హక్కులను కాపాడేందుకు సభ్యులు కృషి చేయాలని ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు సూచించారు. ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన గంట్యాడ మండలం నరవ గ్రామానికి చెందిన బోద అప్పలరాజుకు మండలంలోని అంబటివలస గ్రామంలో గురువారం నియామకపత్రం, ఐడెంటీ కార్డు అందజేశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలగకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సంఘ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి



సంఘ తీర్మానాలను వివరిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు

శృంగవరపుకోట: మండలంలోని నాయీబ్రాహ్మణులు ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఆసంఘం నేతలు అన్నారు. స్థానిక పుణ్యగిరి రోడ్డులోని నాయీబ్రాహ్మణ సేవా సంఘం భవన ప్రాంగణంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సంఘం నేతలు మాట్లాడుతూ ఎస్.కోట పట్టణ పరిధిలో కొత్త సెలూన్‌లు ఏర్పాటుకు సంఘం అనుమతి తీసుకోవాలని, సెలూన్ ఏర్పాటు చేయాలనుకునే వ్యక్తి మండల పరిధిలో ఏదైనా సెలూన్‌లో యేడాది కాలం పాటు పనిచేసి ఉండాలన్నారు. అలాగే రూ.10వేలు ధరావత్తు సంఘానికి చెల్లించి రశీదు పొందాలని చెప్పారు. ప్రతీ సెలూన్ నిర్వాహకుడు నెలకు రూ.100 సభ్యత్వ రుసుం చెల్లించాలని, మంగళవారం సెలవు పాటించాలని, దీన్ని ఎవరు ఉల్లంఘించినా రూ.1000 జరిమానా సంఘానికి చెల్లించాలని నిర్ణయించిన ట్టు చెప్పారు. వీటితో పాటు పలుతీర్మానాలు చేశారు. సంఘ తీర్మానాలను వ్యతిరేకించిన నాయీబ్రాహ్మణులపై సంఘ పరమైన చర్యలు తీసుకుంటామని ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, సభ్యులు బి.శివ, సీహెచ్.గణేష్, ఎం.సన్యాసిరావు, కె.త్రినాథరావు, బి.గణేష్, పి.పేర్రాజు,తదితరులు వివరించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కల్యాణి, తదితరులు

గజపతినగరం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీఓ బి.కల్యాణి అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం'లో భాగంగా మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గురువారం పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వీధుల్లో,రోడ్ల పక్కన చెత్త పారబోసే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు.తాగునీటి బోరుబావులను,రక్షితమంచి నీటి పథకాలను పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు,పంచాయతీ ఈఓ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా సెమిస్టర్-2 పుస్తకాలు

మెరకముడిదాం: మండలంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు ఎంఈఓ-2 ధర్మశ్రీను గురువారం తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. మొత్తం 33 టైటిల్స్‌కు ఇప్పటివరకు 20 టైటిల్స్ పుస్తకాలు వచ్చాయని, మిగిలిన 13 టైటిల్స్‌పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి




సత్యనారాయణ(ఫైల్)

వేపాడ: వల్లంపూడి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పావల సత్యనారాయణ (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయన మృతిపై మండల, ఎస్.కోట నియోజకవర్గ జర్నలిస్టులు సంతాపం తెలిపారు. ఈయన 35 ఏళ్లుగా జర్నలిస్టు వృత్తిలో ఉన్నారు. ఆంధ్రభూమితో పాటు పలు దినపత్రికల్లో పనిచేశారు. ఈయనకు భార్య అచ్చియ్యమ్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

శృంగవరపుకోట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు నిర్వహించే ఈశిబిరంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, అగనంపూడి వారి సౌజన్యంతో రొమ్ము, గర్భసంచి, నోటి క్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని మహిళలు, కిశోర బాలికలు, యువతులు వినియోగించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి

గజపతినగరం: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ పీఓ ఎం.రాజేశ్వరి అన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా జిన్నాం గ్రామంలో మహిళలకు పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. పీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు.పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని అన్నారు. మాంసాహారాన్ని తగ్గించి తాజా కూరగాయలు,ఆకుకూరలు,పండ్లు అధికంగా తీసుకోవాలని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ఆకట్టుకున్నాయి. జిన్నాం గ్రామ సర్పంచ్ యజ్జిరోతు కళావతి, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



జామి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

జామి/బొండపల్లి: అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులు కూడా సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. జామి మండలంలోని వి.ఆర్.పాలెం గ్రామంలో ఏఓ పూర్ణిమ, బొండపల్లి మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో ఏఓ పి.వి.మల్లి కార్జునరావు రైతులకు సమాచారహక్కు చట్టంపై గురువారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఏ సమాచారమైనా సమాచార హక్కు చట్టం ద్వారా అడిగి తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. సమాచార హక్కు చట్టం అనేది అన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు వర్తిస్తుందని, పౌరులు అడిగే సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులు, సంబంధిత శాఖలపై ఉందన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం దరఖాస్తు చేసు కునే విధానాన్ని వివరించారు. ఏఈఓ షేక్ అహ్మద్, ఆయా గ్రామాల పెద్దలు, వీఏఏలు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం



వేపాడ: పాటూరులో నిర్వహించిన శిబిరంలో వైద్య సిబ్బంది

బొండపల్లి: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు సాధారణ వైద్యపరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పలువురికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సమీర, మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీ, సీహెచ్ఓ కర్ణ, ఎంపీహెచ్ఓ తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎ. బాషా, తదితరులు పాల్గొన్నారు.

పాటూరులో..

వేపాడ: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాటూరు గ్రామంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 240 మంది మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు.గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ద్వారపూడి మంగమ్మ, ఈఓపీఆర్డీ రవికుమార్, గ్రామపెద్దలు కొట్యాడ రమణమూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: వరి పంటను తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో తెగుళ్లను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ పి.కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో రైతులతో గురువారం సమావేశమై వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో ఆకుముడత పురుగు సోకే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 400 గ్రాముల ఎసిఫేట్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. పొడతెగులు నివారణకు మాంకోజెబ్ లేదా ప్రొపికొనజోల్‌ను, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని చెప్పారు.అలాగే సమాచార హక్కుచట్టం పై అవగాహన కల్పించారు.

తప్పని ప్రయాణ కష్టాలు



చీపురుపల్లి ఆర్టీసీ కాంప్లెక్సులో మరమ్మతులకు గురైన బస్సు

చీపురుపల్లి: అసలే అరకొర బస్సులు.. ఆపైన మరమ్మతులకు గురవుతున్న బస్సులు వెరసి ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. చీపురుపల్లి ఆర్టీసీ కాంప్లెక్సులో చీపురుపల్లి-విజయనగరం బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. ఆ తరువాత దాదాపు గంట వరకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు కాంప్లెక్సులోనే వేచిచూడాల్సి వచ్చింది.



విజయనగరం వెళ్లే బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు